
సాక్షి
పల్నాడు
శనివారం । 22 । జూలై । 2023



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ నీటిమట్టం శుక్రవారం 517.20 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు 5,088 క్యూసెక్కులు విడుదలవుతోంది.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 1,716 క్యూసెక్కులు వదిలారు. కొమ్మమూరు కాల్వకు 666 క్యూసెక్కులు విడుదల చేశారు.



గవర్నర్ పర్యటనకు పక్కా ఏర్పాట్లు

పెనమలూరు: గవర్నర్ అబ్దుల్ నజీర్ గంగూరు పర్యటనకు పక్కా ఏర్పాట్లు చేస్తున్నట్టు కృష్ణా జిల్లా జేసీ అపరాజితాసింగ్ చెప్పారు. శుక్రవారం గంగూరులో ఆమె పర్యటించారు.

న్యూస్‌రీల్

అటవీ భూముల పంపిణీకి సిద్ధం చేయండి

అధికారులకు కలెక్టర్ శివశంకర్ ఆదేశం

నరసరావుపేట: జిల్లాలో రాజుపాలెం, మాచవరం మండలాల పరిధిలో 2005 కన్నా ముందు సాగులో ఉన్న అటవీ భూములపై గిరిజనులకు హక్కులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. రెండు మండలాల్లో 54 మంది గిరిజనులు 104.26 ఎకరాలను సాగు చేసుకుంటూ వస్తున్నారని, వారికి హక్కు కల్పించేందుకు శుక్రవారం కలెక్టర్ తన చాంబర్‌లో జిల్లా కమిటీతో సమావేశమయ్యారు. అర్హులైన పేదలందరికీ అవకాశం కల్పించాలని, ప్రపంచ గిరిజన దినోత్సవాన వారికి పట్టాలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, అటవీశాఖ అధికారి రామచంద్రరావు, సత్తెనపల్లి, గురజాల ఆర్డీఓలు రాజకుమారి, అద్దయ్య, గిరిజన సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పొల్యూషన్ సర్టిఫికెట్లకు అధిక ధరలు వసూలు తగదు



పట్నంబజారు : పొల్యూషన్ సర్టిఫికెట్లు మంజూరు చేసే సమయంలో వాహనదారుల నుంచి అధిక ధరలు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని డీటీసీ షేక్ కరీం చెప్పారు. గుంటూరు స్వర్ణభారతినగర్‌లోని రవాణా శాఖ కార్యాలయంలో శుక్రవారం పొల్యూషన్ టెస్టింగ్ సెంటర్ల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీసీ కరీం మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన చార్జీలు మాత్రమే వాహనదారుల నుంచి వసూలు చేయాలన్నారు. ఇప్పటికే పొల్యూషన్ టెస్టింగ్ సెంటర్లకు సంబంధించి పలు ఫిర్యాదులు అందాయని వెల్లడించారు. ఇలాంటివి మరోసారి జరగకుండా చూసుకోవాలన్నారు. సమావేశంలో రవాణా శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


నేడు ప్రత్యేక లోక్ అదాలత్

నరసరావుపేట టౌన్: మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం కోర్టు ప్రాంగణంలో ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఒ. వెంకట నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకొని విలువైన సమయాన్ని వృథా కాకుండా కాపాడుకోవాలన్నారు.

యార్డులో 25,762 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 23,914 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 25,762 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.24,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.26,000 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాలుకు రూ.12,500 నుంచి 23,500 వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ. 11,500 నుంచి రూ. 25,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 8,354 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

అరగంటలోనే దుర్గమ్మ దర్శనం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో శుక్రవారం భక్తుల రద్దీ సాధారణంగా కనిపించింది. శుక్రవారం అయినప్పటికీ అధిక శ్రావణం కావడంతో భక్తుల రద్దీ తక్కువగా ఉంది. భక్తులకు అర్ధగంటలోనే అమ్మవారి దర్శనం పూర్తయింది. ఉదయం నుంచి భక్తుల రద్దీ అంతంత మాత్రంగానే ఉండగా, మధ్యాహ్నం మహా నివేదన అనంతరం కొంత కనిపించింది. ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ మరో కొద్ది రోజుల్లో ప్రారంభం కానుండటంతో యువతీ, యువకులు తమకు నచ్చిన కాలేజీలో సీటు రావాలని అమ్మవారిని మొక్కుకున్నారు. మధ్యాహ్నం 12.20 గంటలకు తిరిగి దర్శనాలు ప్రారంభం కాగా 1.30 గంటల వరకు రద్దీ కనిపించింది.

ఉద్యానం ఉల్లాసం

- సాగుకు రాయితీలతో ప్రోత్సాహం
- కలెక్షన్ సెంటర్లు, కోల్డ్‌స్టోరేజ్‌ల నిర్మాణం
- జిల్లాలో 20 కలెక్షన్ సెంటర్లు, మూడు కోల్డ్ స్టోరేజ్‌లు
- రైతులకు ఎంతో ప్రయోజనం



అచ్చంపేట మండలంలోని కలెక్షన్ సెంటర్‌లో తడిచిన మిర్చిని ఆరబెట్టి గ్రేడింగ్ చేస్తున్న దృశ్యం

పెదకూరపాడు: ఉద్యాన పంటల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. సేద్యానికి రాయితీలు అందిస్తోంది. రైతులకు కావాల్సిన సదుపాయాలూ సమకూరుస్తోంది. దీనిలో భాగంగా జిల్లాలో 20 కలెక్షన్ సెంటర్లు, మూడు కోల్డ్ స్టోరేజ్‌లను నిర్మించింది. కలెక్షన్ సెంటర్ల నిర్మాణానికి ప్రభుత్వం ఒక్కో యూనిట్‌కు రూ.11.25 లక్షలు, రాష్ట్రీయ క్రిష్ వికాష్ యోజన (ఆర్‌కేవీవై) ద్వారా రూ.5.25 లక్షలు, మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఫర్ హార్టికల్చర్ (ఎంఐడీహెచ్) ద్వారా రూ.ఆరు లక్షలు ఖర్చు చేసింది. కోల్డ్ స్టోరేజ్‌కు ఒక్కోదానికి ఆర్‌కేవీవై ద్వారా రూ.ఆరు లక్షలు, ఎంఐడీహెచ్ ద్వారా రూ.5.25 లక్షలు వెచ్చించింది. ప్రస్తుతం కోల్డ్‌స్టోరేజ్‌లు, కలెక్షన్ సెంటర్లు రైతులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఒక్కో కోల్డ్‌స్టోరేజ్ నిల్వ సామర్థ్యం 10 టన్నుల వరకు ఉంది.

అత్యధికంగా మిర్చి సాగు



జిల్లాలో అత్యధికంగా రైతులు మిర్చి సాగుచేస్తారు. దీంతోపాటు మొక్కజొన్న, కూరగాయలు సాగు చేస్తుంటారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంట వర్షాలకు తడిచి రైతులు నష్టపోతున్నారు. దీనిని నివారించేందుకు ప్రభుత్వం కలెక్షన్ సెంటర్లు నిర్మించింది. ఈ సెంటర్లలో తడిచిన పంటలను ఆరబెట్టుకునే సౌలభ్యం ఉంటుంది. అక్కడే పంట ఉత్పత్తులు గ్రేడింగ్ కూడా చేసుకోవచ్చు. అలాగే పంటకు తగిన ధర లేనప్పుడు కోల్డ్ స్టోరేజ్‌లలో నిల్వ చేసుకోవచ్చు. కలెక్షన్ సెంటర్లు, కోల్డ్ స్టోరేజ్‌లు రైతు ఉత్పత్తిదారుల సంఘాల నిర్వహణలో ఉంటాయి.

ఈ ఏడాది ఉద్యాన పంటల సాగు ఇలా..	
పంట	విస్తీర్ణం (హెక్టార్లలో)
మిర్చి	58,000
బొప్పాయి	390
అరటి	393
జామ	391
మామిడి	331
నిమ్మ	288
బత్తాయి	765

రాయితీలు ఇలా..

జిల్లాలో ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. కొత్త సాగుదారులకు భారీగా రాయితీలు ఇస్తోంది. జిల్లా రైతులకు హెక్టారుకు మామిడికి రూ.రూ.7,980, జామకు రూ.17,599, బొప్పాయికి రూ.18,497, కూరగాయలకు రూ.20,000, పందిరి కూరగాయలకు రూ.25,000, బత్తాయికి (రెండో పంట) రూ.3,201 రాయితీగా అందజేస్తోంది. రాయితీలపై ఉద్యాన శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించడంతో ఈ ఖరీఫ్‌లో అధిక శాతం మంది ఈ పంటల సాగుకు మొగ్గు చూపిస్తున్నారు. డ్రాగన్ ఫ్రూట్ సాగుపైనా కర్షకులు ఆసక్తిగా ఉన్నారని ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు.

రాయితీలను వినియోగించుకోవాలి



ఉద్యాన పంటలను నిల్వ చేసుకునేందుకు రైతు ఉత్పత్తిదారుల సంఘాల (ఎఫ్‌పీఓల) ఆధ్వర్యంలో కలెక్షన్ సెంటర్లు , కోల్డ్‌స్టోరేజ్‌లు నిర్మించాం. కొత్తగా ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు ఏడాది నుంచి మూడేళ్ల పాటు వివిధ రూపాల్లో ప్రభుత్వం రాయితీలు అందిస్తోంది. వీటిని కర్షకులు వినియోగించుకోవాలి.

– బెన్నీ, జిల్లా ఉద్యానశాఖాధికారి

చేనేతకు చేయూత



చేనేత లబ్ధిదారులకు మెగా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ శివశంకర్

- అట్టహాసంగా వైఎస్సార్ నేతన్న నేస్తం జమ
- జిల్లావ్యాప్తంగా 422 మందికి లబ్ధి
- రూ.1.01 కోట్ల మేర ప్రయోజనం

నరసరావుపేట: వైఎస్సార్ నేతన్న నేస్తం పథక లబ్ధిదారులు అందరూ ప్రభుత్వం అందజేసే ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఎల్.శివశంకర్ సూచించారు. శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరుపతి జిల్లా వేంకటగిరి నుంచి సొంత మగ్గం కలిగిన చేనేత కుటుంబాలకు ఐదో విడత ఆర్థిక సహాయాన్ని బటన్ నొక్కి నేరుగా ఖాతాల్లో జమ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక ఎస్‌ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ లబ్ధిదారులతో కలిసి వీక్షించారు. అనంతరం జిల్లాలోని 422 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.1.01కోట్ల విలువైన మెగా చెక్కును అందజేశారు. అనంతరం కలెక్టర్ లబ్ధిదారులతో ప్రత్యేకంగా మాట్లాడి ఆదాయ వనరుల గురించి అడిగి తెలుసుకున్నారు.

నియోజకవర్గాల వారీగా లబ్ధిదారులు ఇలా..		
నియోజకవర్గం	లబ్ధిదారులు	నిధులు (రూ.లక్షల్లో)
వినుకొండ	36	8.64
నరసరావుపేట	3	0.72
గురజాల	9	2.16
సత్తెనపల్లి	9	2.16
పెదకూరపాడు	13	3.12
చిలకలూరిపేట	295	70.8
మాచర్ల	57	13.68
మొత్తం	422	101.28

సీఎంకు ధన్యవాదాలు



నేను మగ్గం నేయటం ద్వారా కుటుంబాన్ని పోషించుకుంటున్నా. వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం అమలు కావటంతో ఆర్థికంగా కొంతమేర ఇబ్బందులు తప్పాయి. నాకు ఇద్దరు పిల్లలు. అమ్మఒడి వచ్చింది. ఇల్లు కట్టుకునేందుకు స్థలం కూడా ఇచ్చారు. సీఎం జగన్‌కు ధన్యవాదాలు.

– ఏలే నాగమణి, తాళ్లపల్లి, మాచర్ల మండలం

దుర్భరస్థితి నుంచి బయట పడ్డాం



వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం అమలు చేయటం ద్వారా కార్మికుల బతుకులు మారాయి. కొంత మేర దుర్భర పరిస్థితుల నుంచి బయటపడ్డాం. ఆర్థికంగా ప్రభుత్వం ఆసరా కల్పిస్తోంది. చేనేతలకు బడ్జెట్‌లో రూ.200 కోట్లు కేటాయించటం ఆనందదాయకం.

– కట్టా శివ దుర్గారావు, ఫణిదెం వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, సత్తెనపల్లి

పచ్చమీడియావి అసత్య కథనాలు

- మాజీ ఎమ్మెల్యే జీవీ వాస్తవాలు తెలుసుకోవాలి
- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ధ్వజం
- టీడీపీ హయాంలోనే వందల ఎకరాల ప్రభుత్వ భూముల ఆక్రమణ



టీడీపీ అక్రమాలకు ఆధారాలు చూపుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల) : పచ్చమీడియా తనపై వండి వార్చిన అసత్య కథనాలను చూసి వాస్తవాలు తెలియకుండా మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆరోపణలు చేయడం సిగ్గుచేటని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ధ్వజమెత్తారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ 2016లో మాల్వారి ఆగ్రోటెక్ సంస్థ నుంచి శ్రీవత్స ఫుడ్ పార్కు పేరుతో 200 ఎకరాలు కొనుగోలు చేశామని, అయితే ప్రభుత్వ భూమి కొనుగోలు చేసి బ్యాంకుల్లో రూ.53 కోట్లు రుణం తీసుకున్నట్లు ఈటీవీ, టీవీ 5, ఏబీఎన్ చానల్స్ తనపై పదేపదే తప్పుడు ప్రచారం చేశాయని విమర్శించారు. ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్‌లో తనకు ఖాతానే లేదని వివరణ ఇచ్చినా మళ్లీ తప్పుడు ప్రచారం చేశాయని, ఆ కథనాలకు అనుగుణంగా మాజీ ఎమ్మెల్యే జీవీ మాట్లాడటాన్ని ఎమ్మెల్యే బొల్లా తప్పుబట్టారు. గతంలో బొల్లాపల్లి మండలం అయ్యన్నపాలెంలో పేదలకు ఇచ్చిన 120 ఎకరాలు భూములను మాజీ ఎమ్మెల్యే జీవీ బంధువుల పేరుతో అమ్ముకున్నారని, అలాగే కొప్పుకొండలో 160 ఎకరాలను టీడీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే అనుచరులు చేపల చెరువులు వేసి ఆక్రమించుకున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వం వాటిని గుర్తించి భూమిలేని పేదలకు ఇస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ భూములన్నీ ఆక్రమించుకున్నది టీడీపీ వారే అని, తన భూముల్లో ఒక సెంటు కూడా ప్రభుత్వ భూమి లేదని వివరణ ఇచ్చారు. తప్పుడు కథనాలు వండి వార్చిన పచ్చమీడియా దమ్ముంటే వాస్తవాలు నిరూపించాలని సవాల్ విసిరారు. దీనిని ప్రజలంతా గమనిస్తున్నారని పేర్కొన్నారు. శావల్యాపురం మండలంలో 43 ఎకరాల వాగు పోరంబోకు భూములను జీవీ ఆంజనేయులు కొనుగోలు చేసినట్లు చెప్పారు. త్వరలోనే జీవీ అక్రమాల గుట్టు రట్టు చేస్తామని హెచ్చరించారు. జీవీ తనపై చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని, దమ్ముంటే ఇద్దరి ఆస్తులపైనా విచారణకు సిద్ధమేనా అని సవాల్ విసిరారు. రాజకీయంగా తనకు వస్తున్న ఆదరణను చూసి ఓర్చుకోలేక పచ్చమీడియాను అడ్డంపెట్టుకొని అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. టీడీపీ హయాంలో అక్రమాలకు సంబంధించి ఆధారాలు చూపారు. కార్యక్రమంలో వినుకొండ, ఈపూరు మార్కెట్‌యార్డు చైర్మన్‌లు బత్తుల వెంకటేశ్వర్లుయాదవ్, చుండూరి వెంకటేశ్వర్లు, వినుకొండ మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గంధం బాలిరెడ్డి, నూజెండ్ల ఎంపీపీ జయరామిరెడ్డి, పార్టీ కౌన్సిలర్ గంటా కాలేషాలతోపాటు నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారమే లక్ష్యం



మాట్లాడుతున్న విక్టర్ ఇమ్మానుయేలు

సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానుయేలు వెల్లడి

మాచర్ల: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్‌ఎఫ్) చైర్మన్ విక్టర్ ఇమ్మానుయేలు చెప్పారు. శుక్రవారం పల్నాడు జిల్లా మాచర్లలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. చట్టపరంగా వినియోగదారులకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు స్వతంత్రంగా ఈ సీజీఆర్‌ఎఫ్ సంస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా సుదూర ప్రాంతాలనూ సందర్శించి సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తున్నట్లు వివరించారు. వినియోగదారులు విద్యుత్ శాఖ అధికారుల ద్వారా పరిష్కరించుకోలేని సమస్యలను వారి ముందే సమన్వయంతో చక్కదిద్దే కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో స్వతంత్రంగా తమ కమిటీ చట్టపరిధిలో సమస్యలన్నింటినీ పరిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. కమిటీ సాంకేతిక సభ్యులు వెంకట కృష్ణ, ఆర్థిక సభ్యులు రాందాస్, స్వతంత్ర సభ్యులు సునీత, గుంటూరు ఆపరేషన్ ఎస్‌ఈ మురళీకృష్ణ యాదవ్ పాల్గొన్నారు.

నవనగరులు

- నగర వనాల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం
- ఐదు ఎకో పార్కుల వృద్ధికీ కార్యాచరణ
- అటవీశాఖ ఆధ్వర్యంలో చర్యలు
- దాతల సాయంతో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



కొండవీడు నగరవనం ముఖద్వారం

సాక్షి, నరసరావుపేట: ప్రజల ఆహ్లాదం కోసం నగర వనాలు, ఎకో పార్కుల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. దేశంలో నగరాలు, పట్టణాలకు ఆనుకొని ఉన్న అటవీ భూముల్లో ఈ వనాల ఏర్పాటుకు కేంద్రం కొంత మేర నిధులు సమకూరుస్తోంది. వీటికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో వనాలను అభివృద్ధి చేయనున్నారు. అటవీ భూముల పరిరక్షణతోపాటు జనజీవనం ఆహ్లాదకరంగా ఉండాలన్నది నగర వనాల ఏర్పాటు ముఖ్య ఉద్దేశం. ఈ వనాల్లో అడవులు, వన్యప్రాణుల సంరక్షణ గురించి ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రత్యేక బోర్డులు, బొమ్మలు ఏర్పాటు చేయనున్నారు. ప్రతి వనంలో వాకింగ్ ట్రాక్, క్యాంటిన్, ట్రెక్కింగ్, ఓపెన్ జిమ్ ఉండేలా ప్రణాళిక రూపొందించారు.

ఒక్కో నగర వనం రూ.3.28 కోట్లతో..

పల్నాడు జిల్లాలోని అటవీ భూముల్లో నాలుగు, సామాజిక వనాల ఆధ్వర్యంలో ఒకటి మొత్తం ఐదు నగర వనాలను ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో నగర వనానికి హెక్టారుకు రూ.4 లక్షల చొప్పున గరిష్ఠంగా 50 హెక్టార్లకు రూ.2 కోట్ల వరకు కేంద్ర అటవీ శాఖ నిధులు మంజూరు చేస్తుంది. మిగిలినవి రాష్ట్ర ప్రభుత్వం భరించనుంది. ఇలా జిల్లాలోని దేవరంపాడు, వినుకొండ, కోటప్పకొండ, మాచర్లలోని అటవీ భూములతోపాటు, సోషల్ ఫారెస్ట్ తరఫున చిలకలూరిపేట మండలం బొప్పూడిలో నగర వనాలను ఏర్పాటు చేయనున్నారు. వీటి కోసం జిల్లా అటవీశాఖ అధికారులు ఒక్కోదానికి రూ.3.28 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. త్వరలో పనులు ప్రారంభించనున్నారు. కోటప్పకొండలో ఇప్పటికే ఏర్పాటు చేసిన నగర వనం పర్యాటకుల మనసు దోచుకుంటోంది.


రూ.1.20 కోట్లతో ఎకో పార్కు

అటవీ ప్రాంతానికి ఆనుకుని ఉన్న ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతాలలో ఎకో పార్కుల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నారు. వీటిల్లో మౌలిక వసతుల కల్పనకు దాతల సహకారం తీసుకోనున్నారు. పల్నాడు జిల్లాలో దైదా, గుత్తికొండ బిలం, మన్నేపల్లి, సంజీవనకొండ, భట్రుపాలెంలలో ఎకో పార్కులను ఏర్పాటు చేయనున్నారు. వీటికి ఒక్కోదానికి రూ.1.20 కోట్లతో అటవీశాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.



వినుకొండలో నగరవనం ఏర్పాటు చేయనున్న ప్రాంతంలో చర్చిస్తున్న డీఎఫ్ఓ రామచంద్రరావు

ఆహ్లాదంతోపాటు అటవీ ప్రాముఖ్యం తెలిపేలా...



జిల్లాలో ఐదు నగర వనాలు, ఐదు ఎకో పార్కులను అభివృద్ధి చేయనున్నాం. ఇందు కోసం నగరవనాలకు ఒక్కోదానికి రూ.3.28 కోట్లతో, ఎకో పార్కులకు రూ.1.20 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ప్రభుత్వం, దాతల సాయంతో వసతులు మెరుగుపర్చనున్నాం. ప్రజలకు ఆహ్లాదంతోపాటు అటవీ ప్రాముఖ్యం తెలిపేలా వీటిని వృద్ధి చేయనున్నాం.

– ఎస్.రామచంద్రరావు, పల్నాడు జిల్లా అటవీశాఖ అధికారి

ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు

సీఆర్‌డీఏ కమిషనర్ వివేక్ యాదవ్



సభా వేదికను పరిశీలిస్తున్న తలశిల రఘురామ్, హనుమంతరావు తదితరులు

మంగళగిరి: కృష్ణాయపాలెం జగనన్న కాలనీలో ఈనెల 24న ఇళ్ల నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరు కానున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సీఆర్‌డీఏ కమిషనర్ వివేక్ యాదవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కృష్ణాయపాలెం జగనన్న లే అవుట్‌లో ఏర్పాట్లను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. అధికారులకు సూచనలు చేశారు. అనంతరం వెంకటపాలెంలోని మంతెన ఆశ్రమం వద్ద వాహన పార్కింగ్ ఏర్పాట్లను వివేక్ యాదవ్ పరిశీలించారు. గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల నుంచి వచ్చే వాహనాలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా, ట్రాఫిక్ రద్దీ లేకుండా పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. వెంకటపాలెం వేంకటేశ్వరస్వామి గుడి ప్రాంగణంలో జరుగుతున్న సభా వేదిక పనులనూ పరిశీలించారు. షేర్ వాల్ పద్ధతిలో నిర్మిస్తున్న మోడల్ హౌస్‌ను చూశారు.

రూ.72.06 కోట్లతో సోషల్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టులు

పేదల స్థిర నివాసాలతోపాటు విద్య, ఆరోగ్య ప్రమాణాలను అత్యుత్తమ స్థాయికి తీసుకువెళ్లేందుకు అమరావతిలోని 25 లేఅవుట్లలో రూ.72.06 కోట్లతో సోషల్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టులను చేపట్టినట్లు వివేక్‌యాదవ్ వెల్లడించారు. ఈ లేఅవుట్లతోపాటు ప్రస్తుతం ఉన్న టిడ్కో గృహాల్లో సుమారు 2.36 లక్షల మంది జీవనం కొనసాగించనున్న నేపథ్యంలో ఐదువేల మొక్కలను నాటే కార్యక్రమాన్ని నవులూరులో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో వివేక్‌యాదవ్ వెంట ఇంజినీర్లు సీహెచ్ ధనుంజయ, పీవీ పల్లం రాజు తదితరులు పాల్గొన్నారు.

తలశిల సూచనలు

కృష్ణాయపాలెంలోని జగనన్న లేఅవుట్‌లో గృహ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమ ఏర్పాట్లను శుక్రవారం సాయంత్రం ముఖ్యమంత్రి ప్రోగ్రామ్స్ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణ శర్మ కూడా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

బాలుడి అపహరణ కేసులో దంపతులకు జైలు

దుర్గి: నిదానంపాటి అమ్మవారి ఆలయం సమీపంలో 2016లో జరిగిన బాలుడి అపహరణ కేసుకు సంబంధించి దంపతులకు రెండేళ్ల జైలు శిక్ష, రూ.5,000 జరిమానా విధిస్తూ మాచర్ల ఏజేసీజే మేజిస్ట్రేట్ ఎస్.శారద శుక్రవారం తీర్పు నిచ్చారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా పుల్లల చెరువుకు చెందిన యరదేసి రామాంజీ కుటుంబ సభ్యులు అడిగొప్పులలోని నిదానంపాటి అమ్మవారి ఆలయంలో వారి కుమారుడు ఆరు నెలల అరవిందు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు బాబును అపహరించారు. వెంటనే బాధితులు దుర్గి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన అప్పటి ఎస్‌ఐ సుబ్బారావు 48గంటల్లో బాలుడి ఆచూకీని గుర్తించి నిందితులను అరెస్టు చేశారు.

బాబును అపహరించిన కేసులో నిందితులుగా గుర్తించిన ఉమ్మడి ప్రకాశం జిల్లా బల్లికురవ మండలం సూరేపల్లికి చెందిన మేదర సుబ్బారావు, లక్ష్మి దంపతులపై కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావటంతో మేజిస్ట్రేట్ పై విధంగా తీర్పు ఇచ్చారు. మాచర్ల ఏపీపీ రవీంద్రకుమార్ కోర్టులో వాదించారు. కానిస్టేబుల్ ఇ వెంకయ్య తగిన సహాయ సహకారాలందించినట్లు ఎస్‌ఐ సతీష్ తెలిపారు.

ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియ క్షేత్రస్థాయిలో జరగాలి

జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: పల్నాడు జిల్లాలో ఓటర్ల జాబితా తయారీకి సంబంధించిన పరిశీలన కార్యక్రమం క్షేత్రస్థాయిలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం సాయంత్రం జిల్లాలోని ఏడు నియోజకవర్గాల ఎన్నికల నిర్వహణ అధికారులు, మండల అధికారులతో జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి వినాయకంలతో కలసి నియోజకవర్గాలు, మండలాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కొత్తగా వస్తున్న యువ ఓటర్ల దరఖాస్తులో ఉన్న లోపాలు, ఓటర్ల తొలగింపు అంశంపై కలెక్టర్ పలు సూచనలు జారీ చేశారు. నియోజకవర్గాలలో రాజకీయపార్టీల అంశాలను దృష్టిలో ఉంచుకొని తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తప్పుడు ఓటర్ల జాబితా నమోదు కోసం, ఓటర్ల జాబితాలో పేర్లు తొలగింపు కోసం ఆన్‌లైన్ ద్వారా వస్తున్న దరఖాస్తులను జాగ్రత్తగా పరిశీలన చేయాలన్నారు. ఫామ్–6 దరఖాస్తుల వలన అధిక సంఖ్యలో వస్తున్న ఇబ్బందులను అడిగి తెలుసుకొని ఎవరైనా కావాలని రాజకీయ స్వలాభం కోసం తప్పుడు ఓటర్ల జాబితా ఇస్తే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిబంధనల ప్రకారం అధికారులంతా భాగస్వాములై విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ వసంతబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎంప్లాయీస్ గ్రీవెన్స్‌కు 30 అర్జీలు

స్వీకరించిన జిల్లా కలెక్టర్

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్పందన హాలులో జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అధ్యక్షతన ఎంప్లాయీస్ గ్రీవెన్స్ నిర్వహించారు. దీనికి జిల్లాలోని వివిధ శాఖల ఉద్యోగులు, సచివాలయాల ఉద్యోగులు మొత్తం 60 మంది తమ సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు అర్జీలను అందజేశారు. ప్రతి ఉద్యోగితో కూలంకషంగా చర్చించి తగు పరిష్కారాల కోసం సంబంధిత మండల ప్రత్యేకాధికారులు, ఆయా శాఖాధిపతులకు అందజేశారు. వచ్చిన అర్జీలలో సచివాలయ సిబ్బంది బదిలీలు, శాఖాపరమైన సమస్యలు వంటివి ఉన్నాయి. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నెలా మూడో శుక్రవారం గ్రీవెన్స్ నిర్వహిస్తామని వెల్లడించారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ గ్రీవెన్స్‌కు ఏడు ఫిర్యాదులు

స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లోని పీటీడీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఎంప్లాయీస్ గ్రీవెన్స్‌కు ఏడు ఫిర్యాదులు అందాయని ప్రజా రవాణా జిల్లా అధికారి ఎస్.శ్రీనివాసరావు వెల్లడించారు. ఆన్‌లైన్ ద్వారా అందిన ఫిర్యాదుల వివరాలు తెలియాల్సి ఉందన్నారు.



కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో ఉద్యోగుల అభిప్రాయాలను వింటున్న జిల్లా కలెక్టర్

లంక భూములను పరిశీలించిన జేసీ



లంక భూములను పరిశీలిస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్

అమరావతి: మండల పరిధిలోని వైకుంఠపురం లంక భూములను జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ రెవెన్యూ అధికారులతో కలసి శుక్రవారం పరిశీలించారు. జేసీ మాట్లాడుతూ లంక భూములను సాగు చేసుకుంటున్న అర్హులైన రైతులకు ప్రభుత్వం ఐదు సంవత్సరాలకు లీజు పత్రాలను మంజూరు చేస్తుందన్నారు. ఈ పత్రాలతో ప్రభుత్వం రైతులకు అందించే రైతు భరోసా, పంట నష్టం, బ్యాంక్ రుణం వంటి సౌకర్యాలు పొందడానికి వీలవుతుందన్నారు. వైకుంఠపురం గ్రామంలో జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం ద్వారా రీసర్వే చేస్తున్నామన్నారు. ఈ రీసర్వే ప్రక్రియ వేగవంతం చేసి రైతులకు కొత్త పట్టదారు పాస్‌పుస్తకాలను మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో సత్తెనపల్లి ఆర్డీఓ రాజకుమారి, తహసీల్దార్ విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలి

మలేరియా యూనిట్ బాపట్ల జిల్లా అధికారి రాజ్‌కుమార్



వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న మలేరియా శాఖ సిబ్బంది

రేపల్లె: ప్రజలు వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని మలేరియా యూనిట్ జిల్లా అధికారి వై.రాజ్‌కుమార్ అన్నారు. మలేరియా వ్యాధి, సీజనల్ వ్యాధులపై పట్టణంలోని వెలగపూడివారివీధిలో శుక్రవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పరిసర ప్రాంతాలలో నీటి నిల్వలు లేకుండా ప్రజలు గమనిస్తూ ఉండాలని కోరారు. నీటి నిల్వలు, తేమ వాతావరణం ఉన్న ప్రాంతాలలో దోమల ఉద్భృతి పెరిగేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. వారంలో ప్రతి ఒక్కరూ ఒక రోజు డ్రైడేగా పాటిస్తే సమస్య కొంత వరకు పరిష్కారం అవుతుందని చెప్పారు. వ్యాధుల బారిన పడితే వెంటనే వైద్యుడిని సంప్రదించాలని కోరారు. వైద్యుడి సూచనల మేరకు మందులు వాడాలని చెప్పారు. కాచి చల్లార్చిన నీటిని తీసుకోవాలని చెప్పారు. అనంతరం ప్రజలకు మలేరియా వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయా వార్డుల్లో మురుగు కాల్వలలో దోమల నివారణ చేసే మందును పిచికారి చేయించారు. కార్యక్రమంలో మలేరియా యూనిట్ సూపర్‌వైజర్ ఎం.యల్లయ్య, ఏఎస్ఎం అనిత పాల్గొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి మృతి

చీరాల రూరల్: రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం చీరాల– బాపట్ల రైల్వే స్టేషన్ల మధ్య చోటుచేసుకుంది. జీఆర్పీ ఎస్‌ఐ సీహెచ్ కొండయ్య అందించిన వివరాలు.. ఈపురుపాలెం బాలికల హైస్కూల్ సమీపంలో డౌన్‌లైన్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడనే సమాచారం అందింది. దీంతో ఘటనా స్థలాన్ని పరిశీలించినట్లు ఎస్‌ఐ పరిశీలించాడు. మృతుడికి 50 సంవత్సరాల వయసు ఉంటుందని చెప్పారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చీరాల ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష

ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు



చెరుకుపల్లిలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీ మోపిదేవి, కలెక్టర్ రంజిత్ బాషా

చెరుకుపల్లి: ప్రజా సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు పేర్కొన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అర్హులకు లబ్ధి చేకూర్చేందుకే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టినట్లు వివరించారు. సంక్షేమ పథకాల అమలులో పారదర్శకంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మత్తి దివాకర్ రత్నప్రసాద్, జెడ్పీటీసీ సభ్యురాలు ఎం.పావని పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అర్హులకు మేలు
జేసీ చెరుకూరి శ్రీధర్

పర్చూరు(చినగంజాం): జగనన్న సురక్ష కార్యక్రమంలో దేశంలోనే మన రాష్ట్ర ప్రభుత్వం మాత్రమే అందిస్తున్న వినూత్న కార్యక్రమం, అర్హులకు ఎంతో మేలు అని జిల్లా జాయింట్ కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని దేవరపల్లి, కొల్లావారిపాలెంలో గ్రామాల్లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అర్హులకు వెంటనే కౌలు రైతు కార్డులు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వివిధ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలను నాణ్యత లోపించకుండా త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. అనంతరం లబ్ధిదారులకు 811 మందికి సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కే సంధ్యశ్రీ, ఎంపీడీఓ ప్రద్యుమ్నకుమార్, ఈఓఆర్డీ గౌస్, సర్పంచి లాజర్, ఉపసర్పంచి తోకల కృష్ణమోహన్, జేసీఎస్ కన్వీనర్ ఎం.రాఘవ పాల్గొన్నారు.

యువత నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలి

- ఆర్డీఓ గంధం రవీందర్
- జాబ్‌మేళాకు అపూర్వ స్పందన



మాట్లాడుతున్న ఆర్డీఓ రవీందర్

పిట్టలవానిపాలెం: యువత నైపుణ్యాలను మెరుగు పరుచుకుని ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ గంధం రవీందర్ కోరారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో మండలంలోని ఖాజీపాలెం డిగ్రీ కళాశాలలో శుక్రవారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. ఉద్యోగం పొందిన వారు అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. బాపట్ల జిల్లా పరిధిలోని పలు గ్రామాల నుంచి సుమారు 310 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. మొత్తం 17 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. 96 మందిని ఉద్యోగాలను ఎంపిక చేసి నియామక పత్రాలు అందజేశారు. మరో 70 మందిని రెండో విడత ఉద్యోగాలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కవిత, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శివప్రసాద్ పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

వ్యాన్‌ను ఢీకొని..
పొలాల్లోకి దూసుకుపోయిన ఆర్టీసీ బస్సు



రోడ్డు పక్కకు జారిన వ్యాన్, బస్సు

ఫిరంగిపురం: ప్రమాదవశాత్తు వ్యాన్‌ను ఢీకొని ఆర్టీసీ బస్సు రోడ్డు మార్జిన్‌లోని పొలాల్లోకి వెళ్లింది. ఈ సంఘటన మండల కేంద్రంలోని రేపూడి గ్రామశివారులో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం హిందుపురం నియోజకవర్గం మడకశిర డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో విజయవాడ వెళుతోంది. నంద్యాల నుంచి బట్టల లోడుతో విజయవాడ వెళుతున్న వ్యాన్‌కు మండలంలోని రేపూడి గ్రామశివారులో ఎదురుగా ఆటో రావడంతో షడన్ బ్రేకు వేసి రోడ్డు పక్కకు వచ్చాడు. అదే సమయంలో వెనుకగా వస్తున్న ఆర్టీసీ బస్సు వ్యాన్‌ను ఢీకొని రోడ్డు పక్కగా ఉన్న పొలాల్లోకి జారిపోయింది. సంఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న 25 మంది ప్రయాణికులు బస్సు డ్రైవర్లు పాపయ్య, నాగరాజులకు ఎటువంటి ప్రమాదం సంభవించ లేదు. వ్యాను డ్రైవర్‌కు ఏ ప్రమాదం జరగలేదు. దీంతో స్థానికులు బస్సులోని ప్రయాణికులను అటుగా వస్తున్న మరో బస్సులో విజయవాడకు పంపించి వేశారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు.

హత్యాయత్నం కేసులో మూడేళ్లు జైలు

గుంటూరు లీగల్: అప్పు డబ్బు వివాద నేపథ్యంలో జరిగిన హత్యాయత్నం కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ నాలుగో అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎం.కుముదిని శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తెలిపిన వివరాల మేరకు.. గడ్డం సుజాత తన భర్తతో కలిసి గుంటూరు అమరావతి రోడ్డులోని ఆంజనేయపేటలో నివాసం ఉంటుంది. వీరికి అబ్బాయి, అమ్మాయి సంతానం కాగా ఇద్దరికీ వివాహం చేశారు. సుజాత తన అన్నయ్య కుమారుడు మున్నంగి రమేష్‌రెడ్డికి పదేళ్ల కిందట యాభై వేలు అప్పుగా ఇచ్చింది. ఆ డబ్బులు తిరిగి ఇమ్మని ఎన్నిసార్లు అడిగినా ఇవ్వలేదు. రమేష్‌రెడ్డి తనకున్న ఆస్తులు మొత్తం అమ్ముకున్నాడు. సుజాత అప్పు మాత్రం తీర్చులేదు. దీంతో సుజాత గట్టిగా ప్రశ్నించగా డబ్బులు ఇవ్వనని రమేష్‌రెడ్డి తేల్చి చెప్పాడు. సుజాత చెల్లెలు కుమారుడు వంగల సాంబిరెడ్డి, రమేష్‌రెడ్డి, శంకరరెడ్డి మందు తాగుతూ స్నేహంగా ఉంటారు. ఈ క్రమంలో 2018 ఏప్రిల్ 25న సుజాత ఇంటికి వంగల సాంబిరెడ్డి వెళ్లి రమేష్‌రెడ్డి డబ్బులు ఇవ్వడని, ఏమి చేసుకుంటారో చేసుకోమని చెప్పాడు. ఆ సమయంలో సుజాత ఇంట్లో ఉన్న ఆమె కుమారుడు నరసింహారెడ్డికి, సాంబిరెడ్డికి మధ్య వివాదం జరిగింది. దీంతో సుజాత ఇద్దరినీ చెరొక దెబ్బ కొట్టి అక్కడ నుంచి పంపించేసింది. ఈ వివాద నేపథ్యంలో 2018 ఏప్రిల్ 26న రాత్రి పది గంటల సమయంలో సుజాత ఇంటికి వంగల సాంబిరెడ్డి, రమేష్‌రెడ్డి, శంకరరెడ్డి వెళ్లారు. శంకరరెడ్డి కత్తితో విచక్షణారహితంగా సుజాతను పొడిచాడు. ఆమె గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందారు. దీనిపై అరండల్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేయగా హత్యాయత్నం కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం పోలీసులు కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేశారు. కేసు విచారణకు ముందే సాంబిరెడ్డి, రమేష్‌రెడ్డి మృతి చెందారు. శంకరరెడ్డిపై సాక్ష్యాధారాలతో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరుపున ఆకుల జ్యోష్న కేసు వాదించారు. సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టడంలో కోర్టు కానిస్టేబుల్ కె.శివనాగేశ్వరరావు సహకరించారు.